


నిష్పక్షపాత నిర్భయ సమాచారం

22nd ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శుక్రవారం 01-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 31 రూ॥ 6.00




# ప్రసన్న పంతం.. అవినీతి అంతం!

## అవినీతి అధికారుల గుండెల్లో అంకుశం ప్రసన్న

## వైద్యశాఖలో ప్రశ్నించే గాంఢీవం ప్రసన్న










## అవినీతి పరులు చేసిన అనేక అక్రమాలను వెలుగులోకి తెచ్చారు.




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


- ప్రశ్నించినందుకు అనేక అవరోదాలు ఎదుర్కొన్నారు.
- శాఖ పరమైన ఇబ్బందులు అనేక దశల్లో ఎదుర్కొన్నారు.
- జీవితంలో అనేక సమస్యలు ఎదురించి నిలిచారు.
- అయినా గుండె దైర్యం చెదరలేదు.. అవినీతి మీద పోరాటం ఆపలేదు.
- ఇంక్రిమెంట్లు ఆపినా వెనుకడుగు వేయలేదు.
- అడుగడుగునా అణచి వేయాలని చూసినా ఆగిపోలేదు.
- తోటి ఉద్యగులకు అన్యాయం జరిగినా సహించేవారు కాదు.
- శాఖలో అవినీతి జరిగినా ఉపేక్షించే వారుకాదు.
- అడుగడుగునా జరిగే అవినీతిని అడ్డుకున్నారు.
- అవినీతి అధికారుల భరతం పట్టారు.
- అవినీతికి పాల్పడే వారికి కొరకరాని కొయ్యగా మారారు.
- జీవితాంతం శాఖలో జరిగే అవినీతిపై అలుపెరగని పోరాటం చేశారు.
- ఇబ్బందులు ఎదుర్కున్నే తోటి ఉద్యోగులకు అండగా నిలిచారు.
- గత ప్రభుత్వంలో వైద్య శాఖలో జరిగిన అవినీతి పై అనేక ఉద్యమాలు చేశారు.
- న్యాయస్థానాలలో కూడా అవినీతి పరులపై కొట్లాడారు.






## •గత ప్రభుత్వం వైద్య శాఖలో చేసిన అవినీతిపై సీఎం రేవంత్ కు నివేదికలు సమర్పించారు.

## •సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైద్య శాఖలో అవకతవకలపై నివేదికలు అందించారు.

- అప్పుడు సీఎం రేవంత్ పోరాటానికి మద్దతుగా నిలిచారు.
- అనేక నివేదికలు తయారు చేసి రేవంత్ పోరాటానికి సహకరించారు.
- ప్రసన్న సేవలు ఎంతో అవసరమని ఆనాడు సీఎం. రేవంత్ రెడ్డి అన్నారు.

## •ప్రసన్న సేవలు రేవంత్ సర్కార్ వినియోగించుకోవాలి.

- గత పాలకులు చేసిన అవినీతి బండారం బైటకు రావాలంటే ప్రసన్న సేవలు అవసరం.
- కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో ప్రసన్న కీలక భూమిక పోషించారు.
- ఏకంగా కేసీఆర్ ను ఓడించేందుకు ప్రసన్న రంగలోకి దిగారు.
- కామారెడ్డి లో కేసీఆర్ ను ఓడించేందుకు పోటీ కూడా చేశారు.
- కేసీఆర్ ఓటమికి ఓట్ల గండి కొట్టి కాంగ్రెస్ గెలిచేందుకు కారణమయ్యారు.



## •ఆమె సేవలకు గుర్తుగా వైద్య శాఖలో ఏ పదవి ఇచ్చినా వన్నె తెస్తారు.

## •సీఎం రేవంత్ సర్కార్ కు మరింత పేరొచ్చేలా బాధ్యత నిర్వహిస్తారు.

**హైదరాబాద్, నేటిధాత్రి:**

అలుపెరగని పోరాటం అనే పదం అతి కొద్దిమందికి మాత్రమే ఉపయోగిస్తుంటాం. అందులో అవినీతిపై పోరాటం చేసే ప్రసన్న పేరు కూడా చెబుతుంటాం. ఒక మహిళగా, మరో వైపు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ అవినీతిపై పోరాటం చేయడం అనేది గొప్ప విషయం. సహజంగా అవినీతిపై ప్రజా సంఘాలు పోరాటం చేస్తాయి. రాజకీయ నాయకులు పోరాటం చేస్తామంటారు. అవినీతి గురించి సభలు, సమావేశాల్లో చర్చిస్తుంటారు. కాని వ్యవస్థలో వుంటూ, అదే వ్యవస్థలో జరిగే అవినీతిపై నిఘా నేత్రంతో పోరాటం చేయడం అంటే సామాన్య విషయం కాదు. అడుగడుగునా అవాంతరాలు ఎదురౌతాయి. ఉద్యోగ జీవితం ఒడిదొడుకులను ఎదుర్కొవాల్సి వుంటుంది. అవసరమైతే ఉద్యోగం కూడా చిక్కుల్లో పడుతుంది. నిజానికి అవినీతికి పాల్పడే వారి జీవితాలకన్నా, ఉద్యోగ జీవితంలో అవినీతిపై పోరాటం చేసే వారు ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటారు. అయినా సరే..తన ఉద్యోగాన్ని ఫణంగా పెట్టైనా సరే ఆ వ్యవస్థలో అవినీతి అంతం కోసం పాటు పడడం అంటే గొప్ప వ్యక్తిత్వం కావాలి. ప్రజా చైతన్యం నిండి వుండాలి. అలాంటి మహిళా ఉద్యోగే ప్రసన్న. వైద్యశాఖలో ఆమె చిరుద్యోగిగా వృత్తి ప్రస్తానం మొదలైన నాటి నుంచి పైసా అవినీతి కనిపించినా ఆమె ఆక్షేపించేది. అడ్డుకునేది. ప్రశ్నించేది. నిలదీసేది. ప్రభుత్వ కొలువు చేస్తూ, ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ప్రభుత్వం ఇచ్చే జీతం తీసుకుంటూ అవినీతి చేసే వారంటే ఆమెకు నచ్చదు. అసలు అవినీతి అంటేనే ఆమెకు పడదు. అలా అవినీతికి పాల్పడే అధికారుల గుండెల్లో అంకుశం ప్రసన్న. వైద్యశాఖలో తన కళ్లముందు ఎక్కడ అవినీతి కనిపించినా ఆమె సహించేది కాదు. ప్రజా సేవలో వైద్యం అనేది గొప్ప సేవ. అది అందరికీ సాద్యం కాదు. అందరూ చేయలేరు. ఒక రకంగా వైద్య సేవలు చేసే వారు దైవంతో సమానం. అలాంటి స్దానంలో వుండి అవినీతికి పాల్పడడం పాపమని ఆమె భావిస్తారు. అందుకే అవినీతిపరులను ఎదుర్కొంటారు. తన చుట్టూ వున్న సమాజంలో అవినీతి జరగకుండా అడుగడుగునా అడ్డుకున్నారు. అవినీతి నిర్మూలనలో, అవినీతిని అడ్డుకోవడంలో ఆమె విజేతగా నిలిచారు. ఇలాంటి వ్యక్తిత్వం వున్న వారు ఉద్యోగ సమాజంలో చాల తక్కువగా వుంటారు. అందులోనై వైద్యశాఖలో ఏ ఒక్కరో, ఇద్దరో వుంటారు. అందులో ప్రసన్న ఒకరు వున్నారు. అని ఆ శాఖ గర్వంగా చెప్పుకునేలా ఆమె జీవితం గడిపారు. అతి సాధారణ జీవితం. ప్రజా సేవకు అంకితమైన జీవితం. అలా తన శాఖలో అవినీతిని ప్రశ్నించినందుకు అనేక అవరోధాలు ఎదుర్కొన్నారు. పై అదికారుల నుంచి ఉద్యోగ పరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినా ఆమె వేటిని లెక్క చేయలేదు. అవినీతిని ప్రశ్నించడం ఆపలేదు. తన జీవిత కర్తవ్యం సేవ అయితే, లక్ష్యం అవినీతి నిర్మూలన అని గట్టిగా చెప్పిన వైద్యశాఖలో ఏకైక మహిళ ప్రసన్న. ఎందుకంటే వైద్యశాఖలో ప్రభుత్వ సేవలో కూడా అనేక అవినీతికి ఆస్కాముండే పరిస్ధితులున్నాయి. కేంద్రం నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పేద ప్రజలకు సేవ చేయడం కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటారు. వైద్యశాఖకు కేటాయిస్తుంటారు. వైద్యం వచ్చిన వారిని వేదించడం, వారి నుంచి డబ్బులు వసూలు చేయడం దగ్గర నుంచి ప్రభుత్వ గ్రాంట్లలో అవినీతికి పాల్పడడాన్ని ఆమె సహించేది కాదు. వచ్చిన లెక్కకు, పోయే లెక్కలకు లేని పొంతనను చూసి ఆమె అడుగడుగునా ప్రశ్నించేది. నిలదీసేది. ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లేది. ఒంటరిగా పోరాటం చేసేది. అలాంటి సందర్భంలో శాఖాపరమైన ఇబ్బందులు అనేక దశల్లోనూ ఆమె ఎదుర్కొన్నారు. అటు ఉద్యోగపరంగా, ఇటు వ్యక్తిగా సమాజ పరంగా కూడా సవాళ్లను ఎదిరించి నిలిచారు. కొన్ని సార్లు ఆమె ఇంక్రిమెంట్లు కూడా ఉన్నతాధికారులు ఆపడం జరిగింది. అయినా ఆమె వెరవలేదు. వెనుకడుగు వేయలేదు. తన జీతం కోసం ఏనాడు ఆలోచించలేదు. ప్రజల జీవితాలను గురించి మాత్రమే ఆలోచించేవారు. ప్రజలకు న్యాయం జరగాలి. ప్రభుత్వం ఇచ్చే ప్రతి పైసా పేదల వైద్యం కోసం అందాలన్నదే ఆమె లక్ష్యం. అడుగడుగునా అణచి వేయాలని చూశారు. ఉద్యోగ పరంగా చిన్న స్ధానం, పైగా మహిళ కావడంతో ఆమె వివక్షను కూడా ఎదుర్కొన్నారు. ఎవరికీ లేని పట్టింపు నీకెందుకు? ఇంత మందిలో ఒక్కదానికి ప్రశ్నించి ఏం సాదిస్తావు? మమ్మల్ని ఏమీ చేయలేవని కూడా అని ముఖం మీద చెప్పి, బెదిరించిన అదికారులు కూడా వున్నారు. ఉద్యోగిగా ఉన్నతాధికారులను గౌరవిస్తాను. కాని వారి అవినీతిని కలలో కూడా సహించని చెప్పగలిన దీశాలి ప్రసన్న. అవినీతితోపాటు వ్యవస్ధలో తోటి ఉద్యోగులకు ఏదైనా అన్యాయం జరిగినా ఆమె సహించేవారు కాదు. తోటి ఉద్యోగులకు అండగా నిలిచేవారు. వారికి తోడుగా వుండేవారు. వారి పోరాటంలో కలిసి పనిచేసేవారు. తోటి ఉద్యోగులకు శాఖాపరంగా సమస్యలు ఎదురైనా ఊరుకునేవారు కాదు. ఒక రకంగా చెప్పాలంటే ఆమెను చెడును క్షమించేవారు కాదు. అందుకే ఆమె చేసిన అలుపెరగని పోరాటంలో ఎంతోమంది అవినీతి అదికారుల కొలువులు పోయేలా చేశారు. వారి భరతం పట్టారు. ఆఖరుకు కోర్టుల్లో కూడా ఆమె విజయం సాదించారు. ముఖ్యంగా తెలంగాణ వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో వైద్యశాఖలో జరిగిన అక్రమాలపై ఆమె అలుపెరగని పోరాటం చేశారు. అప్పటి డిహెచ్. గడల శ్రీనివాస్ సాగించిన అక్రమాలపై పోరాటం చేశారు. నిధుల దుర్వినియోగం వెలుగులోకి తెచ్చారు. కోట్లాది రూపాయలు ఎలా పక్కదారి పట్టాయో ప్రజల ముందు వుంచారు. అప్పటి పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితంలేకపోవడంతో, అప్పటి ప్రతిపక్ష పార్టీ నాయకుడు, పిసిసి. అధ్యక్షుడుగా వున్న ప్రస్తుత సిఎం. రేవంత్‌రెడ్డికి అనేక నివేదికలు ఇచ్చారు. వైద్యశాఖలో జరుగుతున్న అవినీతిపై అన్ని రకాల సమాచారాలు అందించారు. ముఖ్యంగా డిహెచ్ గడల శ్రీనివాస్ వల్ల వైద్యశాఖ ఎంత నష్టపోతుందో తెలిపే ప్రయత్నం చేశారు. అర్హత లేకున్నా డిహెచ్ కుర్చీ ఆయనకు ఎలా వచ్చింది? అందుకు ఎవరు సహకరించారు? ఎందుకు సహకరించారు? దాంతో సహకరించిన వాళ్లు ఎంత లబ్దిపొందారు? ఆ సమయంలో గడల శ్రీనివాస్ వందల కోట్లు ఎలా మాయం చేశారు? ఆ నిదులతో ఆ సమయంలో ఎన్నికల్లో పోటీకోసం ఎలా ఖర్చు చేశారు? ఇలాంటి అనేక విషయాలపై సమగ్రమైన సమాచారాన్ని సిఎం. రేవంత్‌రెడ్డికి అనేక సార్లు కలిసి అందించారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డి కూడా భవిష్యత్తులో కలిసి పనిచేద్దామని మాట ఇచ్చారు. కాకపోతే ప్రసన్న సేవలు వినియోగించుకోవడానికి ఇంకా సమయం రావడం లేదు. గత ప్రభుత్వం గద్దె దించడంలో కీలక భూమిక పోషించారు. రిటైర్ అయిన తర్వాత ఆమె సిఎం. రేవంత్‌రెడ్డికి రాజకీయం కూడా వైద్యశాఖకు చెందిన అక్రమాలపై సమాచారాలు అందిస్తూ వచ్చారు..అలా కాంగ్రెస్ గెలుపుకోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆమె సహకారం అందించారు. అంతే కాకుండా కామారెడ్డిలో కేసిఆర్ ఓటమికి ప్రధాన కారణమయ్యారు. నేరుగా కేసిఆర్ మీద కామారెడ్డిలో పోటికి దిగారు. కేసిఆర్ ఓటమికి ప్రధాన కారణమయ్యారు. బిఆర్‌ఎస్ ఓటమికి తాను కీలక భూమిక పోషించారు. అయితే ఇలా వైద్యశాఖకుచెంది ఆ శాఖను కాపాడడం కోసం కృషి చేసిన వారిని గతంలో ఎమ్మెల్సీలను కూడా చేశారు. వారి సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవులిచ్చి, తర్వాత వారి అనుభవాలను ప్రభుత్వం వినియోగించుకునేవి. ముఖ్యంగా వైద్య శాఖలో నర్సులుగా పనిచేసిన వారి సేవలను ఆ రకంగా పాలకులు గుర్తించేవారు. అలా వీలుకాని పక్షంలో శాఖకు చెందిన కొన్ని ప్రత్యేకమైన పదవులు అందించేవారు. ముఖ్యంగా ప్రభుత్వం కొనుగోలు చేసే మందుల విషయంలో, వాటి సరఫరా విషయంలో ఎలాంటి అవతవకలు జరకుండా చూసుకునే టిజిఎంఎస్ఐడిసీ వంటి పదవులు ఇచ్చేవారు. నిజంచెప్పాలంటే వైద్యశాఖలో అవినీతి, అక్రమాలు జరగకుండా చూసుకుంటూ వచ్చిన ప్రసన్న సేవలు రేవంత్ సర్కారు కూడా వినియోగించుకోవాలని ఆమె సహచర ఉద్యోగులు కూడా కోరుకుంటున్నారు. ఉద్యోగ సంఘాల నాయకురాలిగా కూడా పనిచేసిన ప్రసన్న సేవలు వినియోగించుకోవాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారు. ప్రజలకు రేవంత్ సర్కారు మెరుగైన పాలన సాగించేందుక దోహదపడేలా ప్రసన్న సేవలను వినియోగిం చుకోవాలని సూచిస్తున్నారు.

# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక
22ND ANNIVERSARY

శుక్రవారం 1-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 31 రూ॥ 6.00






# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక
22ND ANNIVERSARY



శుక్రవారం 01-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 31 రూ॥ 6.00




# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం







- తెలంగాణలో రెట్టింపు సంఖ్యలో అక్రిడిటేషన్లు: పొంగులేటి
- దేశంలోనే అధికంగా తెలంగాణ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు: మంత్రి పొంగులేటి











హైదరాబాద్,నేటిధాత్రి:
రాష్ట్రంలో గతంలో కంటే ఈసారి రెట్టింపు సంఖ్యలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని, ఇందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను పొంగులేటి అందజేసి మాట్లాడారు.

## 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు..

దేశంలో, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ 23,352 మందికే పరిమితం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించామని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామన్నారు. అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. రేపు అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్లు పొంగులేటి వివరించారు.

## సంస్థ మారినా అక్రిడిటేషన్లు ఇస్తాం..

ఈ ప్రక్రియలో మే 10 వరకు కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలి. ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదిస్తాం. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా పలు సూచనలు చేశారు. జర్నలిస్టులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుంది. ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం. త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతాం అని మంత్రి పేర్కొన్నారు.
ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని పొంగులేటి తెలిపారు. గురువారం పలువురు పాత్రికేయులకు ఆయన అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం

- రూ. 7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, నేటిధాత్రి:
సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ. 7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ. 3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ. 85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ. 9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# సలహాదారుగా వీహెచ్ నియామకం



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబినెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

# ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం

## కేవలం మూడు నెలలకే పరిమితం



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని మరియు అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది.
పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేసే ఉద్దేశంతో, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ఈ రాయితీ పథకం మే 1నుంచి జూలై 31 వరకు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుంది. ఈ గడువు లోపు తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం. రాయితీ ప్రకటించడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్లాట్లను/లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020 కు సవరణలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, మరియు పంచాయతీ రాజ్ కమిషనర్ సహా సంబంధిత అధికారులందరినీ ఆదేశించారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా పరిష్కారం లభిస్తుందని, తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే సువర్ణావకాశం ప్రజలకు దక్కిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని

# అధికారులకు భట్టి ఆదేశం





- రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత
- భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
- అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి
- కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం

హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

## ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన





హైదరాబాద్, నేటిధాత్రి:
ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధపడుతున్న 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదని డాక్టర్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

# రేవంత్ తీరుతో పోలీస్ శాఖకు అప్రతిష్ట

## బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని పోలీసులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారని, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పోలీసు డిపార్ట్‌మెంట్ బలి అవుతోందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ నాయకులను ఇరికించే కుట్రలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కేసులో 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదని విమర్శించారు. ఛార్జ్ షీట్‌లో బీఆర్ఎస్ నాయకుల పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు.ఒక సీనియర్ జర్నలిస్టును ఇరికించి, అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేస్తే బీఆర్ఎస్ నాయకుల పేర్లు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారని ఆరోపించారు.




# దత్తత సహాయ కేంద్రం ఏర్పాటు అవగాహన.




కోదాడ, నేటిధాత్రి:
మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కోదాడలో హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ దశరథ్ తో దత్తత సహాయ కేంద్రం ఏర్పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దశరథ మాట్లాడుతూ. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మన ప్రభుత్వ ఆసుపత్రి నందు ఈ దత్తత సహాయ కేంద్రం ఏర్పాటు అవగాహన ద్వారా హాస్పటల్ సిబ్బందికే కాకుండా ప్రజలందరికీ చట్టబద్ధ దత్తతపై అవగాహన అనేది వస్తుందని ఎవరైనా దత్తత కావాలంటే మహిళా శిశు సంక్షేమ శాఖను సంప్రదించి చట్ట ప్రకారం దత్తత తీసుకోవచ్చు అలా కాకుండా చట్ట వ్యతిరేకంగా దత్తత తీసుకుంటే అటువంటి దత్తతకు చట్టబద్ధత ఉండదని అట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి ప్రొటెక్షన్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ. ఎవరైనా వారి పిల్లల సంరక్షణ చూసుకోలేని వాళ్ళు గాని పిల్లలు వద్దనుకున్నవారు పిల్లలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా వదిలివేయకుండా మహిళా శిశు సంక్షేమ శాఖ సూర్యపేట వారికి అప్పగించినట్టయితే ఆ పిల్లలకు రక్షణ సంరక్షణ అందించడం జరుగుతుంది అని తెలియజేశారు.
కోదాడ ఐసిడిఎస్ సూపర్వైజర్ పూజ మాట్లాడుతూ. పిల్లల దత్తత కావాలి అనుకున్న వాళ్లు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ గాని మీ పరిధిలో అంగన్వాడి టీచర్ గాని లేదా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం సంప్రదించినట్లయితే చట్ట ప్రకారం దత్తత ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఐసిడిఎస్ సూపర్వైజర్ పూజ, హాస్పిటల్ డాక్టర్స్ నర్సులు సిబ్బంది ఏఐడి ఎన్జీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ 2026పై సమీక్ష సమావేశం



పరకాల,నేటిధాత్రి :
ఓటరు జాబితా సవరణలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 ప్రక్రియను వేగవంతం చేయడానికి పరకాల తహసిల్దార్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. 2002 సంవత్సరం ఓటరు జాబితాలో ఉన్న పేర్లను 2025 ఓటర్ జాబితాకు అనుసంధానం (మ్యాపింగ్)చేసే అంశంపై ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తహసిల్దార్ టి.విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రెవెన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ కె.నారాయణ హాజరయ్యారు. పరకాల మండలంలో మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా చేపట్టాలని ఇంకా మ్యాపింగ్ కాని వ్యక్తుల వివరాలను ఇంటింటికీ వెళ్లి సేకరించాలని ఆయన సూచించారు. 2002 ఓటరు జాబితాను ఆధారంగా తీసుకుని సంబంధిత వ్యక్తుల పేరు, తల్లిదండ్రులు లేదా తాతల వివరాలను నమోదు చేయాలని బూత్ లెవల్ అధికారులకు(బిఎల్ఓ)ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఎల్ఓలు, చౌక ధరల దుకాణ డీలర్లు, మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 10 వేల కోసం రైతును వేధించిన
# బీట్ అధికారి రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్



గుండాల,నేటిధాత్రి:
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో అవినీతి అధికారి అసలు రూపం మరోసారి బయటపడింది. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ఫారెస్ట్ శాఖ అధికారి సిగ్గు లేకుండా లంచాలు వసూలు చేస్తూ ఏసీబీకి చిక్కడం తీవ్ర కలకలం రేపింది. గుండాల మండలం సాయనపల్లి పరిధిలో పనిచేస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారి బానోతు నరేష్, సాయనపల్లి గ్రామానికి చెందిన పోడు రైతును బెదిరిస్తూ రూ. 10,000 లంచం డిమాండ్ చేశాడు.
ఇబ్బందులు పెట్టకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చిన నరేష్‌పై బాధిత రైతు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో డిఎస్పి,వై రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఆపరేషన్‌లో రైతు నుండి లంచం స్వీకరిస్తున్న సమయంలోనే నరేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.
ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని రగిలించింది. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారి, బదులుగా వారినే దోపిడీ చేయడం పై మండిపడుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తుండగా ఏసీబీ చర్యలతో ప్రజల్లో ధైర్యం పెరుగుతోంది.
లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయండి అంటూ ఏసీబీ అధికారులు పిలుపునిచ్చారు. పోడు రైతులను వేధించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రస్తుతం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం
# పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల,నేటిధాత్రి:
వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల 1, తిమ్మాపూర్ గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత ఆన్ లైన్ లో ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాగింగ్ ఆటోమేటిక్ గా అవుతుందని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జిపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసినహొధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.

## పజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మండల కేంద్రంలోని 30 పడకుల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషెంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబ్, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో ప్రతిభ చూపిన
# ఉప్పల్ బాలుర పాఠశాల..

## నూటికి నూరు శాతం ఉత్తీర్ణత.



కమలాపూర్ (హన్మకొండ), నేటిధాత్రి:
2025-26 పదవ తరగతి పరీక్షల్లో మండలములోని ఉప్పల్ బాలుర పాఠశాల అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం నిర్మల తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో పాఠశాల విద్యార్థి అలుగు తేజ 545 మార్కులు సాధించి మండల పరిధిలోగల ప్రభుత్వ పాఠశాల ఫలితాల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. పదవ పరీక్షల్లో 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా నూటికి నూరు శాతం 18 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారిలో నలుగురూ విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు. మంచి నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలకు కారణమని కొనియాడారు.



# పదవ తరగతి ఫలితాలలో
## మల్యాల ఉన్నత పాఠశాల
# విద్యార్థుల ప్రభంజనం




చందుర్తి, నేటిధాత్రి:
నిన్న విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో చందుర్తి మండలం లోని మల్యాల ఉన్నత పాఠశాలలో మొత్తం 47 మంది విద్యార్థులకు అందరు పాసై 100% ఉత్తీర్ణత సాధించినారు. ఇందులో 20 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులతో విజయ దుందుభి మ్రోగించినారు. 563 మార్కులతో పులికీర్తన, 556 మార్కులతో ఎల్ల చరణ్ పాఠశాలలో ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచినారు.
గణితంలో 15 మంది, సాంఘిక శాస్త్రంలో 14 మంది, ఆంగ్లంలో 11 మంది విద్యార్థులు 90కి పైగా మార్కులు సాధించినారు.
500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ మందాల శారద అబ్రహం, గ్రామ ఉపసర్పంచ్ అనపర్తి నరేష్, గ్రామ పాలకవర్గ సభ్యులు అభినందించి ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పీసరి మంజుల, స్వామి వివేకానంద సేవ సమితి సభ్యులు, ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ మత్స్యగిరిస్వామి
# కళ్యాణ మహోత్సవం



శాయంపేట నేటిధాత్రి:
శాయంపేట మండల కేంద్రం లోని అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయం కాకతీయుల కళావైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. రాష్ట్రం లోనే రెండో మత్స్యగిరిస్వా మి పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచింది. కన్నుల పండుగగా శ్రీ మచ్చగిరిస్వామి కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కందగట్ల కోటేష్, చైర్మన్ సామల బిక్షపతి, భక్తులు, ప్రజలు అధిక మొత్తంలో పాల్గొన్నారు.

# షష్టిపూర్తి వేడుకల్లో పాల్గొన్న ఎంపీడీవో.



నేటిధాత్రి, మొగుళ్లపల్లి:
మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రాళ్ల బండి ప్రభాకర చారి షష్టిపూర్తి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు మొగుళ్ళపల్లి ఎంపీడీవో సురేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి రాళ్ల బండి సరళ ప్రభాకర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. డిపెప్ (ప్రాథమిక విద్యాశాఖ)విభాగంలో అసిస్టెంట్ ఇంజనీరింగ్ గా పదవి విరమణ పొందిన రాళ్ల బండి ప్రభాకర్ షష్టిపూర్తి వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని మొగుళ్ళపల్లి ఎంపీడీవో సురేందర్ గౌడ్ తెలిపారు ఈ కార్యక్రమంలో మొ ట్లపల్లి సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి సీనియర్ జర్నలిస్ట్ రాళ్ల బండి శ్రీనివాస్ డాక్టర్ రాళ్ల బండి ప్రశాంత్. (న్యూరో సర్జన్) ప్రజ్ఞన్. డాక్టర్ రాళ్ల బండి ప్రత్యూష (గైనకాలజిస్ట్ )పాలిక ప్రవీణ్. తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ ప్రపంచంలో బాధ్యతగా మెలగాలి

- వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వై.వి గణేష్
- మహేశ్వరం బిట్స్ కాలేజీలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు
- చైల్డ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా 400 మంది విద్యార్థులకు అవగాహన



నర్సంపేట,నేటిధాత్రి:
ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో యువత బాధ్యతాయుతంగా మెలగాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వై.వి గణేష్ సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైల్డ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా నర్సంపేట మండలంలోని లక్నేపల్లి బిట్స్ కాలేజీలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వై.వి.గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, డీడబ్ల్యుఓ రాజమణి, ఏసీపీ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, డీసీపీఓ ఉమా, సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు, ప్రజ్వల ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. షార్ట్ వీడియోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. సుమారు 400 మంది టీనేజ్ విద్యార్థులు హాజరై చురుకుగా పాల్గొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు యువతలో సైబర్ నేరాలపై చైతన్యం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన హోమం



భూపాలపల్లి నేటిధాత్రి:
భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డ్ పెద్దకుంటపల్లిలో నూతనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన హోమం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వార్డులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మాజీ కౌన్సిలర్ రజిత జుమ్ములాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక హోమం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోమం చేశారు
పూజలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు కుంకుమ పూజలతో పాటు ప్రతిష్ఠించబోయే విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువత, వృద్ధులు పాల్గొని భక్తి గీతాలతో కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా సాగింది ఈ సందర్భంగా విగ్రహ దాతలు బానోత్ మోహన శ్రీ, మోతిలాల్‌లకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హోమ చేశారు



# ఎస్ఐఆర్ పురోగతి ప్రక్రియ ను వేగవంతం చేయాలి.

## రియాజుద్దీన్. గీసుకొండ మండల తహసిల్దార్.




గీసుగొండ, నేటిధాత్రి:
వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తహసీల్దార్ రియాజుద్దీన్ సూచించారు. గురువారం రోజున ఎంపీడీఓ కార్యాలయం మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని తహసిల్దార్ సమీక్షించారు. ఈ సందర్భంగా గీసుగొండ మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రస్తుతం 74.15 శాతం మేర పూర్తయిందని అధికారులు తెలియజేశారు.
ఈ పురోగతిని మరింత పెంచి, నిర్ణీత గడువులో 90 శాతానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి బీఎల్ఓలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఎస్ఐఆర్ అనుసంధానంలో భాగంగా ఓటర్లు 2002 ఓటర్ల జాబితాను ఆధారంగా తీసుకుని తమ పేరు, తల్లిదండ్రులు లేదా తాతల వివరాలను పరిశీలించి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. అలాగే తహసీల్దార్ మరియు ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, సర్పంచ్‌లు ప్రజల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, ప్రతి ఓటరు అనుసంధాన కార్యక్రమంలో పాల్గొనేలా సహకరించాలని తహసీల్దార్ కోరారు. గీసుగొండ మండల ప్రజలు ఎవరికైన సందేహాలు ఉంటే తమ సంబంధిత బీఎల్ఓ లను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి కాలనీ పెద్దలు, సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అనుసంధాన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, బీఎల్ఓ సూపర్వైజర్లు మరియు బీఎల్ఓలు పాల్గొన్నారు.

# దుగ్గొండికి డిప్యూటీ తహసీల్దార్‌ను వెంటనే నియమించాలి

## మాజీ సర్పంచ్ విద్యాసాగర్ గౌడ్ డిమాండ్



దుగ్గొండి, నేటిధాత్రి:
దుగ్గొండి మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌ను వెంటనే నియమించాలని మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ పై అధికారులను కోరారు. ఈ సందర్భంగా పత్రికా ప్రకటన ద్వారా ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. దుగ్గొండి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ఉమారాణి ఏప్రిల్ 25న బదిలీపై రిలీవ్ అయ్యారని, అప్పటి నుంచి మరో అధికారిని నియమించకపోవడంతో మండల ప్రజలు, విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పై చదువుల కోసం కొత్త అడ్మిషన్లు, నోటిఫికేషన్లు విడుదలవుతున్నాయని, వాటికి కులం, నివాసం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అని ప్రభుత్వమే చెబుతోందన్నారు. సర్టిఫికెట్ల కోసం వచ్చే వారిని ఇబ్బంది పెట్టకుండా స్థానిక ఎంఆర్వో ద్వారా జారీ చేయాలని ఆయన కోరారు.

# స్వీయ గణన ప్రక్రియ ద్వారా జనగణన వేగవంతం : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల,నేటి ధాత్రి:
జనగణన-2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ ద్వారా కార్యక్రమం వేగవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బెపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు,సూపర్ వైజర్లకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన,2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు జరగనున్న స్వీయ గణన ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ ఉద్యోగులు,ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు,యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు,గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు,మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో https://se.census.gov.in వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని,ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నెంబర్ వినియోగించాలని,ఇండ్ల గణనకు సంబంధించి 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి రివ్యూ ద్వారా పరిశీలించుకోవాలని తెలిపారు. మే 11వ తేదీ నుండి ఇండ్ల గణన అధికారులు కార్యక్రమంలో భాగంగా ఇంటికి వచ్చినప్పుడు ఈ నెంబర్ ను అందించాలని తెలిపారు. ఆ సమయంలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే ఎన్యుమరేటర్ ద్వారా నవరించుకోవచ్చని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం,సాయంత్రం వేళలలో తమకు కేటాయించిన బ్లాక్ లలోని ఇండ్లను సందర్శించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని,ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

**వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి**

హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి సుమన్ తో కలిసి సందర్శించి వార్డులు, మందుల నిల్వలు,ల్యాబ్,ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురిహొహొకాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు



అందించాలని తెలిపారు. గర్భిణుల ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగే విధంగా ఆశ,ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, నేటిధాత్రి:
జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల సాయికుంట ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి,క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన,మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో మంచిర్యాల నారాయణ విద్యార్థుల ప్రభంజనం

మంచిర్యాల,నేటిధాత్రి:
పదవ తరగతి ఫలితాలలో నారాయణ స్కూల్ ప్రభంజనం బుధవారం విడుదలైన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో మంచిర్యాల నారాయణ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. మొత్తం 32 మంది విద్యార్థుల్లో 25 మందికి పైగా 500కు పైగా మార్కులు సాధించి రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డీజీఎం వెంకటరమణ రెడ్డి,ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ,విద్యార్థుల పట్టుదల,క్రమశిక్షణతో పాటు ఉపాధ్యాయుల నిరంతర శ్రమ ఈ విజయానికి కారణమని తెలిపారు. ఉన్నత లక్ష్యాలతో చదివిన విద్యార్థులకు,వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చైతన్య రావుతో పాటు ఆర్ఐ సత్యం రావు,హైస్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్,ప్రిన్సిపాల్ స్రవంతి, అకాడమిక్ డీన్ వెంకటస్వామి, ఏజీఎం అనాలిసిస్ రాజేందర్, ఏవో కిషన్ తదితరులు పాల్గొన్నారు.




# కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి

## ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి నేటిధాత్రి:
కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగమైన మేడిగడ్డ లక్ష్మీబ్యారేజి,--అన్నారం సరస్వతి బ్యారేజీలను శుక్రవారం ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా మేడిగడ్డ లో కొనసాగుతున్న బోర్ హోల్స్ పనుల పురోగతిని అధికారులను అడిగితెలుసుకున్నారు.
మేడిగడ్డ,అన్నారం ప్రాజెక్ట్ ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కోసం గతంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ఉపయోగించిన షెడ్లను పరిశీలించి సిబ్బంది ఉండేందుకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు.
అనంతరం అన్నారంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బంది వసతి కొరకు గదులను పరిశీలించారు.
అన్నారం ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్ ను పరిశీలించి బోర్ హోల్స్ పనులను ప్రారంభించాలని ఆదేశించారు.



ప్రాజెక్టులో సాంకేతిక పరిశీలన పనులను శుక్రవారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక పరీక్షలను దశల వారీగా చేపట్టాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పరిశీలన పనుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు.
డ్రిల్లింగ్ పనులు చేపట్టేటప్పుడు గట్టి శిలా పొర వచ్చేంతవరకు కొనసాగించాలని సూచించారు. ప్రాజెక్టులో వివిధ దశల్లో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తూ పనుల నాణ్యతను నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరం అందుబాటులో ఉంచాలని, ప్రతిరోజు ఇరిగేషన్ అధికారులు పనులను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఈఎన్సి రమేష్ కుమార్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈలు తిరుపతిరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# హనియ ను సన్మానించిన పాషా



మెట్ పల్లి, నేటిధాత్రి:
పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 550 మార్కులు సాధించిన మెట్ పల్లి పట్టణానికి చెందిన వివేకానంద హైస్కూల్ విద్యార్థిని, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ కూతురు హనియ హోరిన్ ను కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్‌హొపాషా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, రహిమోద్దీన్, షారు, మజార్, అనష్, అబూజర్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో

# ఆర్పీ పై దాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన...
- స్పందించిన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు...
- తక్షణ చర్యలకు ఆదేశం..



చిత్తూరు, నేటిధాత్రి:
జిల్లా కేంద్రమైన చిత్తూరులో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్పీ పై జరిగిన దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని పై స్పందించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.
దాడి ఘటన సంబంధించిన వివరాలను చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ను అడిగి తెలుసుకున్నారు.
బాధిత ఆర్పీకి అధికారులు అండగా నిలవాలని
అవగాహన రాహిత్యంగా వ్యవహరించి, విధుల్లో ఉన్న ఆర్పీ పై దాడి చేసిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఓ మహిళా ఆర్పీ పై అమానవీయంగా ప్రవర్తించడం దురదృష్టకరమని ఖండించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ, నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు..
పొదుపు సంఘాల సభ్యులు కూడా తమ సమస్యను అధికారుల దృష్టికి తెచ్చి, సమన్వయంతో పరిష్కరించుకోవాలే గాని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదనీ, తొందరపడి భౌతిక దాడులకు దిగకూడదని ఆయన హితబోధ చేశారు.

## మల్లాపూర్ మండల్ మొగిలిపేట గ్రామనీకి చెందిన

# ముగ్గురు బాలికలు మండల టాపర్స్



మల్లాపూర్ ఏప్రిల్ 30 నేటిధాత్రి:
పదవ తరగతి పరీక్ష ఫలితాలలో భాగంగా మొగిలిపేట గ్రామానికి చెందిన ర్యాపని అనుష్క 574 గడ్డం అనువంశిక 573 బొడ్డు రిషిక. 572 మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ముందు ముందు భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించాలని కోరుకుంటూ కన్న తల్లిదండ్రులకు మరియు పుట్టిన గ్రామానికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటూ చదువులో ఆర్థిక వెనుకబాటు ఉండకూడదని భావనతో పాఠశాల ఆవరణలో శాలువాతో సన్మానం చేసి నాకు తోచినంత నా సొంత నిధులతో మొదటి మూడు ర్యాంకు లు సాధించిన విద్యార్థి విద్యార్థులకు చిన్న నగదు ప్రోత్సాహం చేసి ఇతర విద్యార్థులకు శాలువాతో చిన్న సన్మాన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఇంత మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందానికి మొగిలిపేట గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ కళా రమేష్ ఉప సర్పంచ్ దండవేని రాజేందర్ వార్డు సభ్యులు నాయకులు పాల్గొని విద్యార్థి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# సేవా భావంతో పుట్టిరోజు వేడుకలు

## దివ్యాంగులకు అండగా నిలిచిన కొత్తపల్లి రామాంజనేయులు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు




నేటిధాత్రి చర్ల :
చర్ల రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి రామాంజనేయులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై రామాంజనేయులు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చుకున్న రామాంజనేయులు ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులను శాలువాలతో ఘనంగా సత్కరించారు అనంతరం ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం తో పాటు నిత్యావసర సరుకులను అందజేసి తన సేవా మనసును చాటిచెప్పారు ఈ కార్యక్రమం ద్వారా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు అండగా నిలవడం తన ధ్యేయమని రామాంజనేయులు తెలిపారు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ సమాజంలో సేవా భావంతో ముందుకు వస్తున్న వ్యక్తులు ఆదర్శంగా నిలుస్తారని రామాంజనేయులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అని కొనియాడారు ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆంజనేయులు మిత్రులు చీమలమర్రి మురళి పోలిన లంకరాజు ముమ్మినేని అరవింద్ బ్రహ్మానంద రెడ్డి కాకి అనిల్ పంజా రాజు తోటమల్ల రవి సుధాకర్ తదితరులు పాల్గొని రామాంజనేయులు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అభిమానులు స్థానికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# మార్కెట్ యార్డ్ ఆవరణలో అన్న ప్రసాద వితరణ




మెట్ పల్లి, నేటిధాత్రి:
లయన్స్ క్లబ్ మెట్పల్లి వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు మహాజన్ నరసింహులు వివాహ మహోత్సవం సందర్బంగా
మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో అన్న ప్రసాద వితరణ జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెలుముల శ్రీనివాసరావు లయన్స్ మహాజన్ నర్సింలు వ్యవసాయ మార్కెట్ వచ్చినా రైతులకు మరియుఅమాలి జాడు కార్మికులకు అన్న ప్రసాద వితరణ చేశారు.
అనంతరం ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ లయన్స్ సభ్యుల పెళ్లిరోజు పుట్టినరోజు కార్యక్రమాలకు అన్నప్రసాద కార్యక్రమం చేయడం చాలా సంతోషకరమని అది వ్యవసాయ మార్కెట్లో రైతులకు అమాలీలకు జాడు కార్మికులకు లయన్స్ క్లబ్ ద్వారా అన్న ప్రసాద వితరణ చేయడం మంచి కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో ముందుంటుందని అన్నారు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ లయన్స్ మెట్పల్లి వారు సేవా కార్యక్రమంలో రాష్ట్రంలోనేమొదటి ర్యాంకులో ఉన్నదని అలాగే అన్నా ప్రసాద కార్యక్రమాలు కాకుండా ఈ సంవత్సరం12 కంటి వైద్య శిబిరం గుండె ఉచిత వైద్య శిబిరం క్యాన్సర్ శిబిరం అలాగే చలికాలంలో పేదలకు అలాగే బిక్షటన చేస్తున్న వారికిదుప్పటి పంపిణీ ఎండాకాలంలో అంబ్రెల్లర్స్ రోడ్లపై పనులు చేస్తున్న వారికి పంపిణీ చేయడం వేసవికాలంలో చలివేంద్రం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాస్ రావు మహాజన్ నరసింహులు ఏఎంసీ డైట్ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కోట విజయ్ కుమార్ ఏఎంసీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ బుద్ధ జయంతి శుభాకాంక్షలు



పరకాల,నేటిధాత్రి
వైశాఖ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే గౌతమ బుద్ధ జయంతి(బుద్ధ పూర్ణిమ)ప్రపంచవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతోంది. బౌద్ధ మతానికి ఆది గురువైన గౌతమ బుద్ధుడు క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో నేటి నేపాల్‌లోని లుంబినిలో జన్మించి నట్లు చరిత్రకారులు,పురావస్తు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కపిలవస్తు రాజు శుద్ధోదనుడు,మహామాయల కుమారుడిగా జన్మించిన సిద్ధార్థుడు,రాజభవనంలో సుఖసౌకర్యాల మధ్య పెరిగాడు. యశోదరతో వివాహం కాగా రాహులుడు అనే కుమారుడు జన్మించాడు. అయితే జీవితంలోని వృద్ధాప్యం, వ్యాధి, మరణం వంటి దృశ్యాలను చూసిన అనంతరం జీవన సత్యంపై ఆలోచనలో పడ్డాడు. 29 ఏళ్ల వయసులో రాజభవనాన్ని విడిచి,సత్యాన్వేషణ కోసం బయలుదేరిన సిద్ధార్థుడు, బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయలో బోధి వృక్షం క్రింద తపస్సు చేసి 35వ ఏట బుద్ధుడిగా అవతరించాడు. మానవ దుఃఖాలకు కోరికలే కారణమని,వాటి నివారణకు అష్టాంగ మార్గాన్ని అనుసరించాలని ఆయన బోధించారు. అష్టాంగ మార్గం ప్రధానసూత్రాలు. దృష్టి,సంకల్పం,వాక్కు,కర్మ,జీవనోపాధి, ఏకాగ్రత,స్మృతి,సమాధి అనే ఎనిమిది మార్గాల ద్వారా సత్యనిష్ఠ,అహింస,ధ్యానం, నైతిక విలువలతో జీవించాలనే సందేశాన్ని బుద్ధుడు అందించారు. బుద్ధుని బోధనలలో ప్రేమ,కరుణ,అహింసకు ప్రాధాన్యం ఉంది. ద్వేషం,కోపం,ప్రతీకారాల కంటే సహనంతో,దయతో జీవించడం గొప్పదని ఆయన ఉపదేశించారు. కోపం మనిషిని నాశనం చేసే అగ్ని వంటిది అని హెచ్చరిస్తూ,శాంతి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసియా దేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ మతస్థులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ బుద్ధుని సందేశాలను స్మరించుకుంటున్నారు. శాంతి,సమాధానం,ప్రేమ, సహాయ భావన వంటి విలువలను జీవితంలో ఆచరించాలని పిలుపునిస్తున్నారు. సారాంశంగా గౌతమ బుద్ధుని బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. మానవ జీవితంలో కోరికలను నియంత్రిస్తూ, నిజాయితీ, ధర్మం,కరుణతో జీవించడం ద్వారానే ప్రశాంత జీవితం సాధ్యమని బుద్ధుని సందేశం స్పష్టంగా చెబుతోంది.



ఇనుగాల దిలీప్
మహారాజ్.ధర్మ సమాజ్ పార్టీ నాయకులు
సెల్:84660 26237

# నెక్కొండ మండలంలో అధికారుల సమీక్ష సమావేశం



నెక్కొండ, నేటిధాత్రి:
జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి గురువారం నెక్కొండ మండలాన్ని సందర్శించారు. పంటల నిలువ కోసం పోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేముల రాజ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఎంపీఓ దయాకర్ ఏఎంసీ కార్యదర్శి కృష్ణ మీనన్ ,ఏఈఓలు, జీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో మక్కజొన్న, రాబోయే వరి పంటల సాగు, కొనుగోలు ఏర్పాట్లు, రైతులకు అందించాల్సిన సదుపాయాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



# గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్

## గ్యాంగ్ సమాచారంతో మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు

హైదరాబాద్, నేటిధాత్రి:

చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు ఫెర్టిలిటీ సెంటర్లకు మురుగన్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ ఇచ్చిన సమాచారం మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో గుజరాత్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆదిలాబాద్‌లో గత ఏడాది వరకు ఇటుకల బట్టిలో పని చేసిన మురుగన్, కేవలం ఒక్క ఏడాదిలోనే చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా ఎదిగాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. గత ఏడాది చైతన్యపురి కేసులో మురుగన్ పేరు వెలుగులోకి వచ్చింది. గత ఏడాది మూడు నెలల పాటు జైల్లో ఉన్న అతడు జూలైలో విడుదలయ్యాడు. ఆపై దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. అతడి భార్య కృష్ణవేణి మరో గ్యాంగ్‌ను నడుపుతున్నట్టు గుజరాత్ పోలీసులు గుర్తించారు. ఈ మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలోనే 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం మురుగన్ గ్యాంగ్ సభ్యులు గుజరాత్ పోలీసుల అదుపులో ఉన్నారు. వారి విచారణలో మురుగన్ గ్యాంగ్‌కు మూడు ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మురుగన్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని గుజరాత్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఫెర్టిలిటీ సెంటర్ల ప్రమేయానికి సంబంధించి పూర్తి స్థాయిలో గుజరాత్ పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లోని ప్రముఖ నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేశారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నోవా సంస్థ నిర్వాహకులు క్లారిటీ ఇచ్చారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌కు.. తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ ఫర్టిలిటీ సెంటర్లపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేయలేదని వెల్లడించారు. చట్టానికి అనుగుణంగా తాము క్లినిక్ సెంటర్లు నిర్వహిస్తున్నామని, క్లినికల్, ఎథికల్, లీగల్ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సోషల్ మీడియాలో తమ ఫర్టిలిటీ సెంటర్లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు పూర్తి అవాస్తవమని, ఎలాంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు తమ సెంటర్లపై జరగలేదని వివరణ ఇచ్చారు. రోగులకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

## అతివేగంతో దూసుకొచ్చిన కారు...

# తప్పిన పెను ప్రమాదం



శ్రీరాంపూర్, నేటిధాత్రి:

అతివేగంతో దూసుకొచ్చిన కార్ తప్పిన పెను ప్రమాదం. గోదావరిఖని నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న ఒక కారు శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ సమీపంలో అతివేగంతో వస్తూ ఒక్కసారిగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ జాతీయ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. రోడ్డుపై ఉన్న హోటళ్ల వద్ద వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలపడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికులు, స్థానికులు సంబంధిత అధికారులను కోరుతూ, రోడ్డుపై వాహనాల నిలుపుదలపై నియంత్రణలు విధించి, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, నేటిధాత్రి:

మే 1వ తేదీన జిల్లాలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో మే 1వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న వేడుకలకు కార్మికులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు జిల్లాలోని మండలాలలో జరిగే వివిధ కార్యక్రమాలను ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి మహోత్సవం

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



తిరుపతి రూరల్ , నేటిధాత్రి:

తిరుపతి రూరల్ పెరుమాళ్ళపల్లి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి.

ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమంలో తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెరుమాళ్ళపల్లి గ్రామ ప్రజల ఐక్యతతో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు దిగ్విజయంగా జరపడం సంతోషకరమన్నారు. లోక కల్యాణం కోసం, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన తుడా ఛైర్మన్ కి గ్రామ పెద్దలు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

పూజా కార్యక్రమాల అనంతరం గ్రామస్తులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు.

ఈ మహోత్సవంలో పెరుమాళ్ళపల్లి గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# రాష్ట్ర భద్రతా సలహాదారుగా బి.శివధర్ రెడ్డి నియామకం.

## శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్టీయూసీ నాయకులు



శ్రీరాంపూర్, నేటిధాత్రి:

రాష్ట్ర భద్రతా సలహాదారుగా (స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ – ఎస్ఎస్ఏ) గా నియమితులైన బి శివధర్ రెడ్డి, (ఐపీఎస్) కు ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ బి జనక్ ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్టియుసి, ఎస్సీఎమ్మెల్యు శ్రేణులు పాల్గొన్నారు. సమావేశంలో ఐఎన్టియుసి కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ.. బి శివధర్ రెడ్డి తన ఉద్యోగ నిర్వహణలో చట్టబద్ధంగా, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసి అనేక సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. ప్రజలతో పాటు ప్రభుత్వ ప్రశంసలు పొందిన సమర్థ అధికారి అని ప్రశంసించారు. ఆయన ఇతర అధికారులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అలాగే, ఆయన రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమితులవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో రాష్ట్ర భద్రత మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు ఎస్. నరసింహారెడ్డి, పి. ధర్మపురి, సి. త్యాగరాజన్, కాంపల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



- గుండ్లపహాడ్‌లో ఎస్‌డబ్ల్యూసీ గోదాం పరిశీలన, రైతుల ఇబ్బందులపై ఆగ్రహం
- సమన్వయ లోపంతో వాహనాలు క్యూలో, 20 శాతం కూడా కొనుగోలు చేయలేదు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నల్లబెల్లి, నేటిధాత్రి:

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మక్కజొన్న రైతులను ఇబ్బంది పెడుతోందని మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. నల్లబెల్లి మండలం గుండ్లపాడు గ్రామంలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాంను బుధవారం స్థానిక మండల బిఆర్ఎస్ లీడర్లతో కలిసి పెద్ది సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ, మార్క్‌ఫెడ్, ఎస్‌డబ్ల్యూసీ, సివిల్ సప్లై, రెవెన్యూ, మార్కెట్, పోలీస్ శాఖలను సమన్వయం చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. గోదాముల నిల్వ సామర్థ్యం తెలియకుండానే అధికారులు వాహనాలను పంపిస్తున్నారని, రోజుల తరబడి వాహనాలు క్యూలో ఉంటున్నాయని తెలిపారు. మక్కల దిగుబడి, కొనుగోలు, గోదాముల సామర్థ్యంపై స్థానిక ఎమ్మెల్యేకు అవగాహన లేదన్నారు. ప్రభుత్వం పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, రైతుల పంట మొత్తం ప్రైవేట్ వ్యక్తులు, దళారుల పాలవుతోందని ఆరోపించారు. గన్ని సంచులు, సుతిలి దారం, ట్రాన్స్‌పోర్ట్ భారాన్ని రైతులపైనే మోపిందని, 40 రోజులుగా రైతులు 45 డిగ్రీల ఎండలో కల్లాల వద్ద, మార్కెట్లలో కాంటాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 20% కూడా మక్కలు కొనుగోలు చేయలేదని, కొనుగోలు చేసిన వాటికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో 42 కొనుగోలు కేంద్రాలు, ప్రతి మండలంలో ఆరు నుంచి ఏడు కేంద్రాలు అన్నిఏర్పాటు చేసి త్వరితగతిన కొనుగోలు చేశామని గుర్తుచేశారు. ఇప్పుడు 90 వేల ఎకరాల్లో మొక్కజొన్న పండితే కేవలం ఆరు కేంద్రాలే పెట్టి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పిఎసిఎస్, ఎఫ్‌పీఓ, ఐకేపీ, రైతు సంఘాల కొనుగోలు కేంద్రాలను తొలగించారని విమర్శించారు. నియోజకవర్గంలో లక్ష మెట్రిక్ టన్నుల గోదాములను తాను నిర్మించానని, పాకాల చెరువు ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటితో అత్యధిక దిగుబడి సాధించామని తెలిపారు. ఇన్ని వసతులున్నా ఆలస్యానికి ఎమ్మెల్యే, అధికారులే బాధ్యులని, ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.



రేపటి నుంచి బీఆర్ఎస్ పార్టీ రైతులకు మద్దతుగా రకాల పోరాటాలు, నిరసనలు చేస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కేర్ల శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ ఇంచార్జి గందె శ్రీనివాస్ గుప్తా, కూస లింగారెడ్డి, పార్టీ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి అజయ్ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల, నేటిధాత్రి:

ప్రధానమంత్రి అజయ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి లక్ష్యాలను సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని వేమనపల్లి మండలం నీల్వాయి, సంపుట, నగరం, బుయ్యారం గ్రామాల లో పర్యటించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి అజయ్ పథకంతో పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. నీల్వాయి గ్రామంలో నిర్వహించిన జనగణన శిక్షణ తరగతులకు హాజరై సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. జనగణన ప్రక్రియను ఖచ్చితంగా, పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. సుంపుటం గ్రామపంచాయతీని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు అటవీ శాఖ అధికారుల వల్ల నిలిచిపోయిన అంశంపై విచారణ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, అటవీ శాఖ అధికారి (ఎఫ్ఆర్ఓ), తహసీల్దార్‌తో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నగరం గ్రామపంచాయతీ నూతన కార్యాలయ భవనాన్ని సందర్శించి, పెన్షన్ లబ్ధిదారులు, బి పి ఓ, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి గ్రామంలోని సంక్షేమ పథకాల అమలు పరిస్థితిని సమీక్షించారు. బుయ్యారం గ్రామపంచాయతీని సందర్శించి ఎస్‌సి కాలనీలో పి.ఎం. అజయ్ పథకం క్రింద చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి అందుతున్న ప్రయోజనాల వివరాలు తెలుసుకున్నారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, రాయితీలు, ఇతర అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, త్రాగునీరు, డ్రైనేజ్ వ్యవస్థల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పి.ఎం. అజయ్ పథకం కింద గుర్తించిన అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో డివిజనల్ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రంతా గస్తీ.. ఉదయమే ప్రమాదం

- తక్కువ సమయంలోనే ట్రాఫిక్ క్లియర్
- బాలానగర్ పోలీసుల సేవలు శభాష్



బాలానగర్ /నేటి ధాత్రి

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జడ్చర్ల నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కంటైనర్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి వస్తున్న మూసాపేట మండలం మాల్దాస్‌పల్లి గ్రామానికి చెందిన కాశన్న కంటైనర్‌ను ఢీకొని కిందపడగా.. అతనికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఇద్దరినీ అంబులెన్సులో షాద్ నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనతో 44వ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, వాహనాలను నియంత్రించి ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. కానిస్టేబుళ్లు దేవేందర్ రెడ్డి, గణేష్ తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు. రాత్రంతా గస్తీ నిర్వహించినప్పటికీ అలసటను పట్టించుకోకుండా విధుల్లో నిమగ్నమయ్యారు. హైవే రోడ్డు భద్రత సిబ్బంది కొరత ఉన్నప్పటికీ.. కానిస్టేబుల్ దేవేందర్ స్వయంగా ముందుండి కంటైనర్‌కు గొలుసులు బిగించి, క్రేన్ సహాయంతో వేగంగా తొలగించారు. పోలీసుల చాకచక్యానికి ట్రాఫిక్ సమస్య తక్కువ సమయంలోనే పరిష్కారమైంది. వారి సేవలను చూసి స్థానికులు, వాహనదారులు ప్రశంసలు కురిపించారు.

# చిన్నారిని మింగిన మిషన్ భగీరథ గుంత

## పూడ్చకుండా ఉంచడంతో గుంతలో పడ్డ ఐదేళ్ల మోక్షిత

### అధికారుల తీరుపై గ్రామస్థుల ఆందోళన



జనగామ, నేటిధాత్రి:

జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక పసి ప్రాణాన్ని బలితీసుకుంది. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో, ప్రమాదవశాత్తు అందులో పడి మోక్షిత అనే ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

స్థానికుల కథనం ప్రకారం.. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో, సుమారు 20 రోజుల క్రితం అధికారులు మరమ్మత్తుల కోసం 4 మీటర్ల లోతున భారీ గుంతను తవ్వారు. అయితే, మరమ్మత్తులు పూర్తయినా లేదా మధ్యలో నిలిచిపోయినా, ఆ గుంతను పూడ్చకుండా అధికారులు అలాగే వదిలేశారు. గత మూడు వారాలుగా ఆ మృత్యు గుంత పాఠశాల ముందే దర్శనమిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా దాని భద్రత గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో కవిత అనే మహిళ ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన ఇద్దరు కుమార్తెలు దక్షిత , మోక్షితలను వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చింది. తల్లి లోపలికి వెళ్లిన క్రమంలో, ఆడుకుంటూ వెళ్లిన మోక్షిత ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయింది. పక్కనే ఉన్న అక్క దక్షిత ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో, కవిత పరుగులు తీస్తూ వచ్చి తన చిన్నారిని కాపాడుకునేందుకు గుంతలోకి దూకింది. కవితతో పాటు దక్షిత కూడా గుంతలోకి దూకింది. గుంతలో మునిగిపోతున్న వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. తల్లి కవిత, అక్క దక్షిత ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఐదేళ్ల మోక్షిత అప్పటికే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ తన కళ్లముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మిషన్ భగీరథ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే మోక్షిత ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు దిగారు. స్కూల్ ఎదుటే అంత లోతైన గుంతను 20 రోజుల పాటు పూడ్చకుండా వదిలేయడం అధికారుల నేరపూరిత నిర్లక్ష్యమేనని వారు మండిపడుతున్నారు. తక్షణమే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో ఆలీంపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

# నిరుపేదలకు అండగా నిలుస్తున్న బీర్ల ఫౌండేషన్



యాదగిరిగుట్ట నేటిధాత్రి:

యాదగిరిగుట్ట మున్సిపల్ యాదగిరిపల్లి 2వ వార్డులో గత కొన్ని రోజుల క్రితం కంసాని అరుణ అనారోగ్యంతో చనిపోవడంతో బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో కంసాని అరుణ కుటుంబ సభ్యులు 50కేజీల బియ్యం అందజేయడం జరిగింది.

నిరుపేదలకు అండగా నిలుస్తున్న బీర్ల ఫౌండేషన్.

ఆలేరు నియోజకవర్గంలో పేద వారికి కష్ట కాలంలో సహాయ సహకారాలు అందిస్తున్న బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత గారు,

ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ బూడిద మధు, యాదగిరిగుట్ట పట్టణ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ సలాం, ఆలేరు నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుడ్ల నరేష్ కుమార్,

సీనియర్ నాయకులు కౌకుంట్ల బాల్ రెడ్డి, బరిగే లక్ష్మయ్య, నాని జహీర్, మిర్యాల రాజేష్, కంసాని ఉప్పలయ్య ,రాజు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఉత్తరాది పీడ.. తెలంగాణ విద్యకు పీడ!


## పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న ఉత్తరాది విద్యా సంస్థలు!



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888





- తెలంగాణ విద్యా సంస్థలను కాబలిస్తున్న ఉత్తరాది సంస్థలు!
- హంగు అర్బాటలతో ఏర్పాటు చేస్తున్నారు.
- తెలంగాణ విద్యను కమ్మేస్తున్నారు.
- తెలంగాణ విద్యా సంస్థలకు సమాధి కడుతున్నారు.
- లక్షలకు లక్షల ఫిజులు వసూలు చేస్తున్నారు.
- చిత్ర, విచిత్రమైన పేర్లు పెడుతున్నారు.
- ఆకర్షనీయమైన పేర్లతో ఆకట్టు కుంటున్నారు.
- తెలంగాణ విద్యా వంతులు స్కూల్ పెట్టుకోవాలన్నా సవాలక్ష ప్రశ్నలు!
- గతంలో తెలంగాణ కు చెందిన విద్యా సంస్థలకు తోకలు తగిలించొద్దన్నారు.
- స్కూల్ అని మాత్రమే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.
- స్కూల్స్ పేరులో టెక్నో లాంటి పేర్లపై అభ్యంతరం తెలిపారు.
- ఇప్పుడు ఉత్తరాదికి చెందిన విద్యా సంస్థలు విచిత్రమైన పేర్లు పెడుతున్నారు.
- పైగా టీచర్లు గా ఉత్తరాది వాళ్లనే తీసుకుంటున్నారు.
- తెలంగాణ వాళ్లకు అవకాశం కల్పించడం లేదు.







## చదివేది తెలంగాణ విద్యార్థులు.. చదువు చెప్పేది ఉత్తరాది వాళ్ళు!










## మాతృ బాషను లేకుండా చేసే కుట్రలో ఇది కూడా ఒక భాగమే!

- ఒకప్పుడు విద్యా వ్యవస్థలో సౌత్ ఇండియా నెంబర్ వన్.
- ఇప్పటికి ఉత్తరాదిలో నిరక్ష రాస్యత ఎక్కువ.
- అలాంటి రాష్ట్రాల నుంచి వచ్చి స్కూల్స్ పెడుతున్నారు!
- ఇప్పటికే అన్ని వ్యాపారాలలో దూరిపోయారు.
- తెలంగాణ వ్యాపారులను బికారీలను చేస్తున్నారు.
- ఇప్పుడు తెలంగాణ విద్యా సంస్థల మీద పడ్డారు.

## తెలంగాణ ను సర్వ నాశనం చేసే దాకా వదిలిపెట్టేలా లేరు

**హైదరాబాద్, నేటిధాత్రి:**
చిన్నప్పుడు పుస్తకాలలో ఆర్యుల దండయాత్ర అనే పాఠాలు అందరూ చదువుకున్నారు. ఇప్పుడు అదే ఉత్తర భారతం నుంచి వ్యాపారం ముసుగులో అనేక మంది వస్తున్నారు. వ్యాపార సామ్రాజ్యాలు విస్తరిస్తున్నారు. అన్ని రకాల వ్యాపారాలలో స్దానిక వ్యాపారాలకు స్దానం లేకుండా చేస్తున్నారు. మన రాజ్యాంగం కల్పించిన హక్కుల పరంగా ఎవరు ఎక్కడైనా నివాసం వుండొచ్చు. ఎక్కడైనా వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ వుంది. కాని వ్యాపారం ముసుగులో స్దానిక ప్రజలకు ఉపాది లేకండా చేయడాన్ని రాజ్యాంగం కూడా స్వాగతించదు. ఇది ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద గుదిబండలుగా మారిపోతున్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని రకాల వ్యాపారాలతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చేరారు. ఎవరి ఉపాది వారిదే అన్న ధోరణి అందరూ కనబర్చారు. కాని కొన్ని మౌలికమైన రంగాలు ప్రత్యేంగా వుంటాయి. అందులో విద్య అనేది అత్యంత ప్రతిష్టాత్మకమైంది. ముందు టీ స్టాల్స్‌తో మొదలైన ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు కార్పోరేట్ వ్యాపారాలను శాసించే స్దాయికి ఎదిగారు. అలా చిన్నగా బట్టల దుకాణాలు మొదలు పెట్టిన వారు ఇప్పుడు తెలంగాణలో వ్యాపారాలను తెలంగాణ వారికి అందకుండా కబలించేశారు. ఆ వ్యాపారాలలో తెలంగాణకు చెందిన వ్యక్తులకు కనీస ఉపాది కూడా అందకుండా చేస్తున్నారు. వారి మనుషులనే తెచ్చుకుంటున్నారు.న వారి ప్రాంతాల ప్రజలకు ఉపాది కల్పిస్తున్నారు. తెలంగాణ యువత వలసలు పోయే పరిస్దితి తీసుకొస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉత్తరాధి రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది వచ్చి చేరి కొన్ని లక్షల కిరాణ దుకాణాలు పెట్టేశారు. నగరంలో ఏ వీదిలో చూసినా వాళ్లే కనిపిస్తున్నారు. వారి సిండికెట్ వ్యాపారంలో నాసి రకం సరుకులు ప్రజలకు అంటగడుతున్నారు. అవి కూడా అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇక సెల్ ఫోన్‌ల దుకాణాలకు లెక్కే లేదు. ప్రతి చిన్న చిన్న పట్టణంలోనూ సెల్‌ఫోన్ దుకాణాలు పదులు, వందల సంఖ్యలో ఏర్పాటు చేశారు. తెలంగాణ వ్యక్తులకు ఉపాది లేకుండా చేశారు. చిన్న హొటళ్ల నుంచి మొదలు పెద్ద పెద్ద హొటళ్లు ఏర్పాటు చేసుకున్నారు. గృహ నిర్మాణంలో రంగంలో దూరిపోయారు. ఇంటికి అవసరమైన అన్ని రకాల వస్తువుల సరఫరాకు చెందిన షాపులను విచ్చలవిడిగా ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కడ చూసినా వాళ్లే కనిపిస్తున్నారు. ఇక బంగారం దుకాణాల గురించి ప్రత్యేకంగా చెప్పేదేమీ లేదు. ఎక్కడ చూసినా బంగారం షాపులు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యక్తులవే వున్నాయి. వైద్య సేవల ముసుగులో ఇప్పటికే అనేక ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. కంటి ఆపరేషన్లకు చెందిన కొన్ని ఆసుపత్రులు తెలంగాణలోని ప్రతి చిన్న పట్టణంలోనూ ఏర్పాటు చేశారు. ఇలా వైద్య రంగాన్ని కూడా పూర్తిగా ఆక్రమించారు. కాకపోతే ఒక్క విద్యారంగంలోకి వాళ్లు ప్రవేశించడం లేదన్న ధైర్యం వుండేది. కాని ఇప్పుడు ఆ రంగంలోనూ ప్రవేశించారు. అతి తక్కువ సమయంలో తెలంగాణలోని అన్ని జిల్లాలలోతోపాటు, హైదరబాద్‌లో అనేక స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా వెలుస్తూనే వున్నాయి. పుట్టగొడుగుల్లా విద్యా సంస్దలను ఏర్పాటు చేస్తున్నారు. పైగా అందులో ఉపాద్యాయలను, ఇతర సిబ్బందిని కూడా పూర్తిగా ఉత్తరాదికి చెందిన వాళ్లేనే నియమించుకుం టున్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో విద్యా వ్యవస్ధ ఎలా వుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దేశంలో బిహార్ రాష్ట్రం అక్షరాస్యతలో,పేదరికంలో అట్టడుగు స్దాయిలో వుంది. అలాగే ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, నుంచి మహారాష్ట్ర , ఒరిస్సా, అస్సాం, చత్తీస్ఘడ్ ఇలా చెప్పుకుంటూ అన్ని రాష్ట్రాలలోనూ సరైన విద్యా వ్యవస్ధ లేదు. కాని ఆది నుంచి దక్షిణాదిన బలమైన విద్యా వ్యవస్ధలు వున్నాయి. అక్షరాస్యతలో మూడు, నాలుగు దశాబ్దాల క్రితమే సంపూర్ణ అక్షరాస్యత గ్రామాలు తెలంగాణలో అనేకం వున్నాయి. కేరళ రాష్ట్రం కొన్ని దశాబ్దాల క్రితమే మొత్తం రాష్ట్రమే సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా అవతరించింది. అలాంటి దక్షిణాది రాష్ట్రాలలో ఉత్తరాది వాళ్లు విద్యా సంస్దలు ఏర్పాటు చేయడం అంటే పరిస్దితి ఏలా వుందోఅర్దం చేసుకోవచ్చు. అన్ని రకాల వ్యాపారాల లాగానే విద్యను కూడా పూర్తిగా వ్యాపారంగా మార్చడంలో భాగంగానే ఇలా ఉత్తరాదికి చెందిన వాళ్లు వచ్చి స్కూళ్లు పెడుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే వదిలేస్తే ప్రాదమిక, మాధ్యమిక విద్యలతోపాటు, పూర్తిగా ఉన్నత విద్యలలోనూ ఉత్తరాది సంస్దలు పుట్టగొడుగుల్లా వస్తాయి. తెలంగాణకు చెందిన చిన్న, చితకా స్కూళ్లు, కాలేజీలే కాదు, పెద్ద పెద్ద కార్పోరేట్ విద్యా సంస్దలు కూడా భవిష్యత్తులో మనుగడ లేకుండా పోతాయి. తెలంగాణలో ఇప్పటికే కొన్ని కార్పోరేట్ కాలేజీల మూలంగా అనేక చిన్న చితకా లోకల్ కాలేజీలు మూతపడ్డాయి. అందులో పనిచేసే అద్యాపకులు జీవితాలు వీధినపడ్డాయి. కాలేజీలు ఏర్పాటు చేసిన యాజమన్యానాలు అప్పుల పాలయ్యాయి. వాళ్లు కూడా ఉపాది లేకుండా పోయారు. తెలంగాణలో అనేక స్దానిక స్కూళ్లు కూడా కొన్ని వేలల్లో కార్పోరేట్ స్కూళ్ల పుణ్యమా అని మూతపడ్డాయి. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన కార్పోరేట్ విద్యా సంస్దలు కూడా ఉత్తరాధి వాల్లకు చెందిన విద్యా సంస్థల మూలంగా కనుమరుగయ్యే కాలం తరుముకొస్తోంది. ఒకప్పుడు తెలంగాణలో స్కూళ్లపేర్లకు ముందు వెనుకు ఏవైనా తోకలు తగిలిస్తే ప్రభుత్వాలు కొరడా ఝులిపించాయి. కేవలం ప్రైవేటు స్కూల్ అని మాత్రమే పేరుండాలని ఆదేశాలు జారీ చేశాయి. ఆ సమయంలో కొన్ని స్కూళ్లకు టెక్నో స్కూల్స్ అంటూ కొన్ని రకాల పేర్లను జత చేసేవారు. ప్రభుత్వ ఆదేశాలతో కార్పోరేట్ స్కూళ్లు కూడా ఆ పేర్లను తొలగించాయి. కాని ఇప్పుడు ఉత్తరాది నుంచి వచ్చిన వాళ్లు పెడుతున్న పేర్లు ఎవరికీ అర్ధమయ్యేలా లేవు. అసలు వాటి అర్ధమేమిటో కూడా తెలియకుండా వుంటున్నాయి. ఆ పేర్లు ఏ రాష్ట్రానికిచెందిన అర్ధాలతో ముడి పడి వున్నాయో కూడా తెలియకుండా వుంటున్నాయి. కాకపోతే ఆకర్షణీయంగా వుండేలా పేర్లు పెడుతున్నారు. పెద్ద పెద్ద అపార్టుమెంట్లలో ఏర్పాటు చేస్తున్నారు. స్కూల్ అంటే ఎలా వుండాలో అనేదానికి కొన్ని ప్రత్యేకమైన నిబంధనలున్నాయి. స్కూల్ నిర్మాణం ఖచ్చితంగా అర్ధ చంద్రాకారాంలో మాత్రమే నిర్మాణమై వుండాలి. క్రమేనా అపార్టుమెంటు కల్చర్ రావడంతో అలా నిర్మాణాలకు తావు లేకుండా పోయింది. తరగతి గదులకు వెలుతురు, గాలి సమృద్ధిగా రావాలి. ప్రతి స్కూల్‌కు ఆట స్ధలం వుండాలి. ఇలా కొన్ని ఖచ్చితమైన నిబంధనలున్నాయి. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ స్కూళ్ల నిర్మాణం ఇప్పటికీ అలాగే జరుగుతంది. కొత్తగా ఉత్తరాదికి చెందిన విద్యా సంస్దలు అద్దాల మేడల్లా ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. చిత్ర విచిత్రాల పేర్లు పెడుతున్నారు. అయినా తెలంగాణ విద్యాశాఖ కండ్లు మూసుకుంటోంది. అసలు అలాంటి పేర్లను ఎలా విద్యాశాఖ ఎలా అనుమతినిస్తుందనేది ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యార్ధి సంఘాలు కూడ దానిపై దృష్టిపెట్టడం లేదు. తెలంగాణ విద్యావంతులు కూడా ఇప్పటి వరకు స్పందించడం లేదు. తెలంగాణకు చెందిన వ్యక్తులు స్కూల్, కాలేజీ ఏర్పాటు చేసుకోవాలంటే సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. అనుమతుల్లో అనేక తికమకలు పెడుతుంటారు. కాని ఉత్తరాదికి చెందిన వారికి ఎలా అనుమతులు ఇస్తున్నారు? పైగా తెలంగాణలో ఉత్తరాది వాళ్లు ఏర్పాటు చేస్తున్న స్కూళ్లలో, కాలేజీల్లో స్దానికులకు అవకాశాలు కల్పించడం లేదు. ప్యూన్ నుంచి ప్రిన్సిపల్ దాకా అందరూ ఉత్తరాదికి చెందిన వాళ్లే ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలాంటి విద్యా సంస్ధలు విస్తరిస్తే తెలంగాణలో స్దానికుల స్కూళ్లు, కాలేజీలే కాదు, ఇప్పుడు గుత్తాధిపత్యం వహిస్తున్న కార్పోరేట్ కాలేజీలు కూడా బిచాణ ఎత్తేయడం ఖాయమే అవుతుంది. ఇక చిన్నా చితక కాలేజీలు, స్కూళ్లు పూర్తిగా మాయమైపోతాయి. విద్యా సంస్థల ముసుగులోస్దానిక బాషలను బొంద పెట్టే కుట్రలో కూడా ఇవి భాగమైపోయే ప్రమాదముంది. ఇప్పటికే తెలంగాణ రాజదాని హైదరాబాద్‌లో తెలుగు రాసే వాళ్లు కరువౌతున్నారు. తెలుగు మాట్లాడడమే నామోషీగా ఫీల్ అవుతున్నారు. ఇదే కొనసాగితే కొంత కాలం పోతే తెలంగాణలో తెలుగు కనుమరుగయ్యే ప్రమాదం లేకేపోలేదు. తెలంగాణ విద్యాసంస్దలకు మరణ శాసనం కాక తప్పదు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి
TQRCG

"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం
22ND ANNIVERSARY వసంతాల అక్షరోద్యమం 2004-2026
చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు" దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు ముందుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....
మీ కట్టా శివ సుబ్రహ్మణ్యం సీఈఓ, నేటిధాత్రి డిజిటల్ మీడియా 8520007444
22th ANNIVERSARY 2004-2026 వసంతాల అక్షరోద్యమం
మీ కట్టా రాఘవేందర్ రావ్ సీఈఓ, నేటిధాత్రి దినపత్రిక 9908658888, 8297779999

నేటిధాత్రి 9
NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం



పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
"యూట్యూబ్ ఛానల్" కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034



"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

# ఆరోగ్య ధాత్రి

## మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్ ఇవే..!

మార్చిలోనే భానుడి ప్రతాపంతో ఎండ తాకిడి మొదలైంది. మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. వేసవి తాపం తీర్చుకునేందుకు జనం పండ్ల రసాలు వంటివి తీసుకోవడం సహజం. అయితే మధుమేహులు తమ షుగర్ లెవెల్స్ పెంచని సమ్మర్ డ్రింక్స్‌ను ఎంచుకోవడం మేలు. ఎలాంటి పరిస్థితులోనూ పండ్ల నుంచి తీసిన రసాన్ని మధుమేహులు తీసుకోరాదని బెంగళూర్‌కు చెందిన డైటీషియన్ నిధి నిగం హెచ్చరిస్తున్నారు. ఫ్రూట్ జ్యూస్‌లో పండులో ఉన్నంత ఫైబర్ ఉండదని దీంతో వెనువెంటనే షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. అయితే ప్రత్యామ్నాయ సమ్మర్ పానీయాలతో మధుమేహులు తమ దాహార్తి తీర్చుకోవచ్చని సూచిస్తున్నారు.
డయాబెటిక్‌తో బాధపడేవారు వారి షుగర్ లెవెల్స్ పెరగకుండానే హైడ్రేట్‌గా ఉండేందుకు ఇంటి నుంచే కొన్ని సహజసిద్ధమైన, ఆరోగ్యకర కూలింగ్ డ్రింక్స్ తయారుచేసుకోవచ్చని డైటీషియన్ కవితా దేవ్‌గన్ చెబుతున్నారు. భోజనానికి ముందు ఈ సమ్మర్ డ్రింక్స్



తీసుకోవాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తున్నారు. ఇక మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్‌ను పరిశీలిస్తే..

**సబ్జా సీడ్స్‌తో కొబ్బరి నీరు,చియా సీడ్ డ్రింక్,కోకుమ్ షర్బత్,మజ్జిగ,
క్రాన్‌బెర్రీ జ్యూస్,వెజిటబుల్స్ జ్యూస్**

## స్ట్రాబెర్రీస్, ద్రాక్ష తినేముందు ఇలా చేయండి..!

స్ట్రాబెర్రీస్, ద్రాక్ష సీజన్ ప్రారంభం కావడంతో వీటిని చాలా మంది ఆస్వాదిస్తుంటారు. అయితే వీటిని తినే ముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వీటిని సరైన రీతిలో శుభ్రం చేయకుండా తీసుకుంటే గొంతు నొప్పి సహా పలు ఇన్ఫెక్షన్లు వెంటాడతాయని ఆరోగ్య సంరక్షకులు చందర్ అస్రానీ చెబుతున్నారు.
ఈ పండ్లపై మిగిలిఉండే ఎరువులు, రసాయనాలను తొలగించేందుకు ఉప్పు నీటిలో 20 నిమిషాల పాటు నానబెట్టి ఆపై డ్రై క్లాత్‌తో తుడిచిన తర్వాతే వాటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే అస్వస్థతకు లోనయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.




## సమతుల ఆహారమే.. మన ఆరోగ్యానికి హామీ

మన ఆరోగ్యానికి సమతుల ఆహారమే హామీ ఇస్తుంది. రోజువారీ భోజనంలో అన్నంతోపాటు ఐదు రకాల రంగురంగుల కూరగాయలను సమపాళ్లలో తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేస్తే తినే పళ్లాన్నే కాకుండా మన జీవితాన్నీ రంగులమయం చేసుకోవచ్చు, ఆరోగ్యంగా బతికేయొచ్చు.



**పాలకూర**
30 గ్రాములు తీసుకోవాలి. రోజువారీ విటమిన్ ఎ అవసరంలో 16 శాతం లభిస్తుంది. అలానే విటమిన్ కె 120 శాతం అందుతుంది. క్యాన్సర్ ముప్పును పాలకూర తగ్గిస్తుంది.



**క్యారట్లు**
128 గ్రాములు తీసుకోవాలి. వీటిలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. రోజువారీగా అవసరమైన ఎ విటమిన్‌లో 119 శాతం దీన్నుంచి లభిస్తుంది. క్యాన్సర్ నివారణకు వీటిలో ఉండే బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ దోహదపడుతుంది.






**బ్రకోలిజి**
91 గ్రాముల బ్రకోలి నుంచి రోజువారీ విటమిన్ కె 77 శాతం లభిస్తుంది. విటమిన్ సి 90 శాతం అందుతుంది. అదనంగా ఫోలేట్, మాంగనీస్, పొటాషియం కూడా లభిస్తాయి. ఇది కూడా క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. గుండెజబ్బులకు సంబంధించిన ఇన్‌ఫ్లమేటరీ కారకాలను నియంత్రిస్తుంది.

**పచ్చి బటానీలు**
160 గ్రాముల బటానీల్లో 9 గ్రాముల ఫైబర్, 9 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఎ, సి, కె విటమిన్లు, రిబోఫ్లేవిన్, థయామిన్, నియాసిన్ లాంటి బి కాంప్లెక్స్ విటమిన్లు, ఫోలేట్ సమృద్ధిగా ఉంటాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి, ట్యూమర్ల ముప్పు తగ్గడానికి పచ్చి బటానీలు దోహదపడతాయి.

## వ్యాయామంతో తగ్గనున్న స్ట్రోక్ ముప్పు

మెదడుకు అకస్మాత్తుగా రక్త సరఫరాలో అడ్డంకులు ఏర్పడినప్పుడు స్ట్రోక్ ముప్పు తలెత్తుతుంది. రక్తసరఫరాలో బ్లాకేజ్ (ఇస్కిమిక్ స్ట్రోక్), బ్లీడింగ్ (హమరేజిక్ స్ట్రోక్) వంటి సమస్యలతో స్ట్రోక్ ముంచుకొస్తుంది. ఈ సందర్భాల్లో మెదడుకు ఆక్సిజన్, పోషకాల సరఫరా నిలిచిపోవడంతో మెదడు దెబ్బతినడం, మెదడు కణాలు దెబ్బతినడం జరుగుతుంది. స్ట్రోక్స్ ప్రాణాంతకమే కాకుండా దాని ప్రభావం మెదడు, శరీర అవయవాలపై తీవ్రంగా ఉంటుంది. ఇది స్ట్రోక్ ఎక్కడ తలెత్తింది, బ్రైన్ డ్యామేజ్ ఏ మేరకు జరిగిందనే దానిపై అది చూపే ప్రభావ తీవ్రత ఆధారపడి ఉంటుంది.
అయితే నిత్యం వ్యాయామం చేసేవారిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలతో పాటు స్ట్రోక్ ముప్పును కూడా నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా మెదడు సహా శరీర భాగాలన్నింటికీ రక్తసరఫరా మెరుగుపడుతుంది. నిత్య వ్యాయామంతో స్ట్రోక్ ముప్పును తగ్గించే కారకాలను పరిశీలిస్తే..



**వ్యాయామంతో గుండె ఆరోగ్యం మెరుగు
బరువు నియంత్రణ
బీపీ నియంత్రణ
అదుపులో మధుమేహం
కొలెస్ట్రాల్ బ్యాలెన్స్
రక్త సరఫరా మెరుగుదల
వాపు ప్రక్రియకు చెక్
ఒత్తిడి మటుమాయం
నూతన కణాలతో రక్తసరఫరా మెరుగుదల**

## ఈ డీటాక్స్ డ్రింక్స్‌తో అందం, ఆరోగ్యం సొంతం

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని కోరుకోని వారంటూ ఉండరు. ఈ క్రమంలో డీటాక్స్ డ్రింక్స్‌కు విపరీతమైన ఆదరణ పెరుగుతోంది. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో చిత్తయ్యే రోజుల్లో శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను బయటకు పంపే ప్రక్రియ డీటాక్స్ డ్రింక్స్‌తో సాధ్యం కావడంతో వీటిని తీసుకునేందుకు పలువురు ఆసక్తి చేపుతున్నారు.
డీటాక్సిఫికేషన్ ప్రక్రియలో శరీరానికి సహకరించేందుకు మనం తీసుకునే ఆహారంలో మార్పులు తప్పనిసరని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. డీటాక్సిఫికేషన్ ప్రక్రియలో శరీరంలోని కీలక అవయవాలు శుభ్రం అవుతాయి. వందల ఏండ్లుగా డీటాక్సింగ్‌ను ఎందరో అనుసరిస్తున్నారని, ఇది ప్రాచీన థెరఫీ అని మ్యాగీ పనెల్ తన బుక్ ది డిటాక్స్ కుక్‌బుక్ అండ్ హెల్త్ ప్లాన్‌లో రాసుకొచ్చారు.
డీటాక్స్ జీర్ణ వ్యవస్థను శుభ్రం చేయడంతో పాటు శరీరం నుంచి వ్యర్థ పదార్ధాలను విసర్జించడంలో సహకరిస్తుంది. ఈ క్రమంలో డీటాక్స్ డ్రింక్స్ ఆదరణ పొందుతున్నాయి. శరీరం నుంచి వ్యర్థాలను తొలగించకుంటే అది కడుపుబ్బరం, గ్యాస్, తలనొప్పి, మలబద్ధకం, చర్మ సమస్యల వంటి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. రోజూ డీటాక్స్ డ్రింక్స్ తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం, జీవ క్రియల వేగం పెరగడం, జీర్ణశక్తి మెరుగవడం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. ఇక ప్రతిరోజూ మనం ఎలాంటి డీటాక్స్ డ్రింక్స్ తీసుకోవచ్చంటే..



**దానిమ్మ జ్యూస్,నిమ్మ, మింట్‌తో కొబ్బరి నీళ్లు,డీటాక్స్ పసుపు టీ,తేనె, నిమ్మ,
అల్లం టీ ,ఆరెంజ్, క్యారెట్, అల్లం డీటాక్స్ డ్రింక్
లెమన్, మింట్ డ్రింక్,కీరా, మింట్ డ్రింక్,పింక్ సాల్ట్, అల్లం డీటాక్స్ వాటర్,జీరా వాటర్**

## ఫోలేట్.. తీసుకుంటున్నారా?

ఫోలేట్‌ను విటమిన్ బి9 అని కూడా పిలుస్తారు. రోజువారీ పనులు, గర్భిణిగా ఉన్న సమయంలో పిండం అభివృద్ధిచెందడంలో, తల్లి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు తగినమోతాదులో ఉండటంలో ఫోలేట్ కీలకపాత్ర పోషిస్తుంది. ఇది తక్కువగా ఉంటే నాడులకు సంబంధించిన రుగ్మతలు వస్తాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. ఫోలేట్ వివిధ ఆహార పదార్థాల నుంచి సహజంగానే లభిస్తుంది. ఇక విటమిన్ సప్లిమెంట్లు, ఫోర్టిఫైడ్ ఆహారాల్లో మాత్రం దీన్ని ఫోలిక్ యాసిడ్ రూపంలో జతచేస్తారు. అయితే, సహజమైన ఫోలేట్‌లా కృత్రిమ ఫోలిక్ యాసిడ్ శరీరంలో కలిసిపోదని కొందరి అభిప్రాయం.
కాబట్టి మనం తినే ఆహారంలోనే ఫోలేట్ ఎక్కువగా ఉన్నవాటిని ఎంచుకోవడం మంచిది. పాలకూర, తోటకూర, అవకాడో, పచ్చిబటాణీలు, బ్రసెల్స్ స్ప్రౌట్స్, బ్రకోలి, ఆవకూర, టమాటాలు, నారింజ, పల్లీలు, అంగూర్లు, పొప్పడి, అరటి పండ్లు, పచ్చసొనతో కూడిన గుడ్లు, జంతు మాంసంలో తినదగిన అవయవాలు (ఆర్గాన్ మీట్స్)



మొదలైన వాటిలో ఫోలేట్ దొరుకుతుంది. అయితే సేంద్రియమైనవి, హానికరమైన పురుగుమందుల అవశేషాలు లేని పదార్థాలు ఎంచుకోవాల్సి ఉంటుంది.

## ఈ ఆహారంతో ఫ్యాటీ లివర్ ముప్పునకు చెక్



ఆధునిక జీవనశైలితో మద్యం సేవించే వారితో పాటు మద్యం తీసుకోని వారిలోనూ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్) ఫ్యాటీ లివర్ సమస్య పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. లివర్‌లో అధికంగా కొవ్వు పేరుకుపోవడం ద్వారా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితి నివారించడం, నియంత్రించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది.
ఫ్యాటీ లివర్ వ్యాధి ముప్పును తగ్గించేందుకు ఆరోగ్యకర ఆహారాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహారంలో ముఖ్యంగా పాలకూర వంటి యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సీ వంటి విటమిన్స్, మెగ్నీషియం వంటి మినరల్స్ అధికంగా ఉండే ఆకుకూరలు అధికంగా తీసుకోవాలి.
ఇవి లివర్‌లో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంతో పాటు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను నియంత్రిస్తాయి. ఇక ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే సాల్మన్, మాకెరెల్, సార్డినెస్ వంటి ఫ్యాటీ ఫిష్‌లు లివర్‌లో ఫ్యాట్ లెవెల్స్, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఒమెగా 3 ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇక ఒలెరుపిన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ కూడా లివర్ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఇక ఈ పది ఆహారాలను డిన్నర్‌లో తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్‌ను నియంత్రించవచ్చు..

**ఆకుకూరలు ఫ్యాటీ ఫిష్ ఆలివ్ ఆయిల్ నట్స్, సీడ్స్ అవకాడో వెల్లుల్లి
బెర్రీస్‌జి గ్రీన్ టీ పసుపు తృణధాన్యాలు**

